విశాలాంధ్ర కృష్ణా జిల్లా

పాల ఉత్పత్తి దారుల సంక్షేమమే కృష్ణా మిల్క్ యూనియన్ ధ్యేయం : చలసాని

విశాలాంధ్ర-గుడ్లవల్లేరు : పాల ఉత్పత్తి దారుల సంక్షేమమే ధ్యేయంగా కృష్ణామిల్క్ యూనియన్ కృషి చేస్తోందని ఆ సంస్థ ఛైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. స్థానిక పాలశీతలీకరణ కేంద్రంలో గురువారం జరిగిన బోనస్ పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాల ఉత్పత్తిదారుల సహకారంతో 2021-22 ఆర్థిక సంవత్సరంలో సంస్థ రూ.వెయ్యి కోట్ల లావాదేవీలను నిర్వహించిందని చెప్పారు. ఆగస్టు నుంచి నవంబరు వరకు రైతులకు (15%) బోనస్ రూ.89,90,870 అందించామని చలసాని తెలిపారు. రైతులకు పాల ఉత్పత్తి పెంపుదలకు పోషక విలువలు కలిగిన పశువుల దాణాను, మేలు జాతి వీర్యాన్ని, ఉచిత డి వార్మింగ్ మందులను, అత్యవసర సంచార పశువైద్య సేవలను అందించటం, క్షీరబంధు, కళ్యాణమస్తు, ప్రతిభ వంటి పథకాలను, ప్రవేశ పెట్టామని ఆయన వెల్లడించారు. విజయసంస్థ పురోభివృద్ధికి సమష్టి కృషి చేసినప్పుడే సత్ఫలితాలను సాధించగలుగుతామని అటు రైతాంగం, ఇటు ఉద్యోగులు గ్రహించాలని ఆంజనేయులు సూచించారు. ఈ కార్యక్రమంలో సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కొల్లు ఈశ్వర్ బాబు, ఫీడ్ మిక్సింగ్ ప్లాంట్ మేనేజర్ వి.ఎస్.లక్ష్మణరావు, జిల్లా పాలకవర్గ సభ్యులు, పాలసంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.

అభివృద్ధిపై దృష్టి పెట్టాలి : ఎంపీపీ

విశాలాంధ్ర-గుడివాడ : గ్రామల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రతి గ్రామం అభివృద్ధి చేందాలంటే ప్రతి సర్పంచి, అధికారులు దృష్టి పెట్టి అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని గుడివాడ ఎంపీపీ గద్దే పుష్పరాణి అన్నారు. స్థానిక ఎంపీపీ కార్యాలయంలో గురువారం గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై ఎంపీడీవో జి.వెంకటరమణ ఆధ్వర్యంలో జరిగిన రెండు రోజుల శిక్షణ శిబిరం మెదటి రోజు ఎంపీపీ పాల్గొని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో గుడివాడ రూరల్ మండలంలోని 21 గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ మండల స్థాయి ,గ్రామ స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

సుస్థిర అభివృద్ధికి కార్యాచరణ

విశాలాంధ్ర-మచిలీపట్నం: సుస్థిర అభివృద్ధి లక్ష్యా లకు సంబంధించి ప్రాధాన్యత అభివృద్ధి సూచికలలో నిర్దే శించిన లక్ష్యసాధనకు కార్యాచరణ ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. ప్రాధాన్యత అభివృద్ధి సూచికలపై ముఖ్యమంత్రి చీఫ్ ఎగ్జిక్యూటివ్ సమీర్‌శర్మ, వైద్య ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి ఎంటి.కృష్ణబాబు గురువారం జిల్లా కలెక్టర్లతో వేరు వేరుగా వీడియో కాన్ఫరెన్స్‌లు నిర్వహించారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాలకు సంబంధించి 8 ప్రాధాన్యత అభివృద్ధి సూచికలలో లక్ష్యాల సాధనకు ముఖ్యమంత్రి ప్రాధాన్యతనిస్తున్నారని, వీటిపై దృష్టి సారించాలని కలెక్టర్లకు సూచించారు. వీడియో కాన్ఫరెన్సులలో జిల్లా కలెక్టర్ కలెక్టరేట్ నుండి పాల్గొని జిల్లా ప్రగతిని వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రంజిత్‌బాషా మాట్లాడుతూ సుస్థిర అభివృద్ధి లక్ష్యాలకు సంబంధించి 8 ప్రాధాన్యత అభివృద్ధి సూచికలలో లక్ష్యాల సాధనకు సమగ్ర సర్వే నిర్వహించాలని, సచివాలయాల వారీ డేటా సమర్పించాలన్నారు. జిల్లాలో గర్భవతులకు నెలవారీ, కిషోర్ బాలికలకు మూడు నెలలకో సారి రక్తహీనత నివారణకై నిర్వహించే వైద్యపరీక్షలు నూరుశాతం నిర్వహించాలన్నారు. అంగన్‌వాడీల ద్వారా గర్భవతులకు, శిశువులకు వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ కింద నిర్ధేశించిన మెనూ ప్రకారం పోషకాహారం అందించి వారిని ఆరోగ్యవం తులుగా చేయాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారం నూరుశాతం గర్భవతులు, శిశువులు తీసుకునే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. హైరిస్క్ గర్భవతుల పట్ల ప్రత్యేక వైద్య జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డిఎం అండ్ హెచ్‌వో డా.గీతాబాయి, డిఎల్ డివో సుబ్బారావు, ఐసిడిఎస్ పిడి ఎస్.సువర్ణ, వైద్యాధికారి డా.శర్మిష్ట, ఆర్‌ఐవో రవికుమార్ పాల్గొన్నారు.



రీసర్వే పనులు వేగవంతం: కలెక్టర్

భూహక్కు-భూరక్ష పత్రాల పంపిణీ ప్రక్రియ, రీసర్వే పనులను జిల్లాలో సమగ్ర కార్యాచరణ, సిబ్బంది సమిష్టి సమన్వయంతో వేగవంతం చేస్తున్నట్లు కృష్ణాజిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా చెప్పారు. భూహక్కు పత్రాల జారీ, జగనన్న శాశ్వత భూహక్కుకు సంబంధించి రీసర్వే, వివాద స్థలాలపై చర్యలు, మ్యుటేషన్లపై జిల్లా కలెక్టర్లతో గురువారం రాష్ట్ర భూపరిపాలన ప్రధాన కార్యదర్శి, ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జి.సాయిప్రసాద్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిప్రసాద్ మాట్లాడుతూ వారాల తరబడి వాయిదాలు వేయకుండా మిగిలిన రీసర్వే పనులను వచ్చే ఏడాది ఫిబ్రవరి లోపు ఫ్లైయింగ్ పూర్తి చేయాలన్నారు. మరో వారంలో 22 వేల పత్రాలు జారీ చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. నిర్ణీత గడువులోగా మ్యుటేషన్లను తీసుకోవాలని, ఇప్పటి వరకు పెండింగులో ఉన్న వాటిపై ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టాలని కలెక్టర్లకు సిసిఎల్ఎ కమిషనర్ ఆదేశించారు. సమావేశంలో జిల్లాకలెక్టర్ పి.రంజిత్‌బాషా, జాయింట్ కలెక్టర్ డా.అపరాజిత సింగ్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు, భూసర్వే, రికార్డుల శాఖ సహాయ సంచాలకుడు ఎస్.గోపాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

నాలుగు నెలల్లో రోడ్డు నిర్మాణం

భగీరథ విగ్రహ ఆవిష్కరన సభలో మంత్రి జోగి హామీ

విశాలాంధ్ర-కృత్తివెన్ను: నాలుగు నెలల్లో వాలంక గ్రామానికి రోడ్డు నిర్మాణం చేపట్టనున్నట్లు రాష్ట్ర గృహ నిర్మాణ శాఖా మంత్రి జోగి రమేష్ గ్రామస్తులకు హామీ ఇచ్చారు. గురువారం మంత్రి మండలంలోని వాలంక గ్రామంలో శ్రీ భగీరథమహర్షి విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వాలంక గ్రామానికి తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో రోడ్డు నిర్మాణం చేసానని గుర్తుచేసారు. తరువాత వచ్చిన ప్రభుత్వం గ్రామానికి కనీసం రోడ్డు మరమ్మత్తులు కూడా చేయలేదని విమర్శించారు. నాలుగు నెలల్లో గ్రామానికి పక్కారోడ్డు నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. బీసీ కులాలంటే వెనుకబడి తరగతులు కాదని సమాజానికి వెన్నుముక అన్నారు. ఇంటిలో ఉన్న పిల్లలను బాగా చదివించాల్సిన బాధ్యత తల్లి తండ్రులదేనని అన్నారు. పిల్లలకు ఉన్నతమైన చదువులు చదువుకుంటే కుంటుంబం అభివృద్ధి సాధిస్తుందని అన్నారు. పిల్లలకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమ్మఒడి ద్వారా నగదు ఇస్తున్నారని గుర్తుచేసారు. ప్రతిఇంటికి మంచినీటి కుళాయి నిర్మాణానికి రూ. 40 లక్షలు మంజూరయ్యాయని, పనులు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. అనంతరం మంత్రి జోగి చెరుకుమిల్లి గ్రామంలో పమిడికొండల ఆంజనేయులు నూతన గృహప్రవేశం వేడుకలలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కూనసాని గరుడు ప్రసాదు, జెడ్‌పిటిసి మైలా రత్నకుమారి, ఏఎంసీ చైర్మన్ కొల్లాటి గంగాధరరావు, పట్టపు నాగేశ్వరరావు, పులగం నరసింహారావు, ఆకన సాయికుమార్, కూనసాని శ్రీనివాసు, పులగం సుబ్రమణ్యం, యడవల్లి వీరబాబు, జాల్లా భూపతిరాజు, జన్యావులు ఝాన్సీ తదితరలు పాల్గొన్నారు.

సందేశాత్మక సినిమాలు సమాజానికి అవస్యం : ఛైర్‌పర్సన్ హారిక

విశాలాంధ్ర-మచిలీపట్నం: సందేశంతో కూడిన సినిమా నేడు సమాజానికి ఎంతో అవసర మని జెడ్పీ ఛైర్‌పర్సన్ ఉప్పాల హారిక అన్నారు. కాలం రాసిన కథలు సినిమా పోస్టర్ ఆవిష్కరణ గురువారం జడ్పీ ఛైర్‌పర్సన్ ఉప్పాల హారిక చేతుల మీదుగా జెడ్పీ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా హారిక మాట్లాడుతూ గ్రామీణ వాతావరణాన్ని తలపించే విధంగా కాలం రాసిన కథలు సినీ నిర్మాణం జరగటం అభినందనీయమన్నారు. పెడన నియోజకవర్గం కట్లపాలెంకు చెందిన దర్శకుడు సాగర్ పూర్తిగా గ్రామీణ వాతావరణంలో సినిమా తీయడం జరిగిందన్నారు. కార్యక్రమానికి గౌరవ అతిథిగా హాజరైన మచిలీపట్నం సాహితీ మిత్రుల అధ్యక్షులు, న్యాయవాది లంకిశెట్టి బాలాజీ మాట్లాడుతూ నేటి సమాజంలో దూరమైపోతున్న బంధాలను తెరకెక్కించిన ఘనత దక్కిందన్నారు. దర్శకుడు ఎం.వి.ఎస్. సాగర్ మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా అతి తక్కువ బడ్జెట్‌తో యువ కళాకారులతో సినిమాను తీయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకుడు ఉప్పాల రాము, జడ్పీ సీఈవో శ్రీనివాసరావు, సినీ హీరోయిన్ పల్లవి, హీరో రవితేజ, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కోనుగోళ్లలో ప్రభుత్వం విఫలం : మండలి

విశాలాంధ్ర-మోపిదేవి : ఆరుగాలం కష్టించి రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయ డంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ ఉపసభాపతి మండలిబుద్ధ ప్రసాద్ విమర్శిం చారు. మండలంలోని వెంకటాపురం, రావివారి పాలెం, బోడగుంట, శివారామపురం గ్రామాల్లో గత కొద్ది రోజులుగా కొనుగోలు లేక రహదారుల వెంబడి ఆరబోసిన ధాన్యాన్ని బుద్ధప్రసాద్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని రైతుల నుండి రైతులు పడుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులు వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి పండించిన ధాన్యాన్ని సరైన సమయంలో కొనుగోలు చేయటంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. రైతులు పండించిన ధాన్యం రహదారుల వెంబడి రోజుల తరబడి ఆరబోసు కుని కాపాలా కాయాల్సిన పరిస్థితి రావటం దారుణమన్నారు. తుఫాన్ ప్రభావంతో వర్షాలు కురిసి ఏ ఒక్క రైతు ధాన్యం తడిసినా అందుకు ప్రభుత్వమే నైతిక బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. రైతులు ఆర్థికంగా దెబ్బతినకుండా ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలన్నారు. ఖరీఫ్ సీజన్లో వరి కోత యంత్రాల ద్వారా నూర్పిళ్లు పది రోజులుగా సాగుతున్నా ధాన్యం కొనుగోలుకు సంబంధించి నిర్దేశితమైన ప్రణాళికలు రూపొందించుకోవాల్సిన అధికార యంత్రాంగం ఏమీ చేస్తున్నారంటూ ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షులు నడకుదుటి జనార్ధనరావు, తెలుగుయువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రావి రత్నగిరి, సిడిసి చైర్మన్ రావి నాగేశ్వరరావు, వైస్ ఎంపీపీ కడవకొల్లు సీతారామాంజనేయులు, మండల పరిషత్ కో-ఆప్షన్ సభ్యులుచందన రంగారావు, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు మండలి వెంకట్రామ్, వెంకటాపురం గ్రామపార్టీ అధ్యక్షులు గొరిపర్తి వేణు, తెలుగుయువత నాయకులు కొల్లి మురళీకృష్ణ, కొక్కిలిగడ్డ నాగరాజు, పరందామయ్య, పరుచూరి శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ రావి వెంకటేశ్వరరావు, రావి ప్రభు ప్రసాద్, కొమ్ము వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

ఎన్‌ఆర్‌ఈజీఎస్ పనులపై సోషల్ ఆడిట్

విశాలాంధ్ర-కూచిపూడి : మొవ్వ మండలంలో 2020-21, 2021-22 ఆర్థిక సంవత్సరంలో నిర్వ హించిన మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులపై గురువారం ఎంపీడీవో కార్యాలయంలో సోషల్ ఆడిట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ పనులకు ఎస్.ఆర్.పిగా నియమించిన ఏసోబు పర్యవేక్షణలో ఏడుగురు డిఆర్పిలు మండలంలోని ఈ 21 గ్రామాలలో వారం రోజులుగా నిర్వహించిన పనులపై తనిఖీలు నిర్వహించి పంచాయతీలలో నిర్వహించిన సమావేశాల అనంతరం రూపొందించిన నివేదికలను సభాముఖంగా వెల్లడించారు. ఈ నివేదికలపై అధికారులకు ఆయా గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్. ఏపీవో వివరణలను అందజేశారు. ఈ కార్యక్రమాన్ని ప్రొసీడింగ్ అధికారిగా వ్యవహరించిన గుడివాడ ఏపీ డి రమణారావు కొనసాగించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కొండేటి ఇందిర, ఎండిఓ జి సుధా ప్రవీణ్, ఈ ఓ పి ఆర్ డి వీర్ల సీతారామరాజు, ఏపీవో కే లక్ష్మీరెడ్డి, ఎస్ ఎస్ పి టి డైరెక్టర్ ఈశ్వరరావు, ఏపీవో నాంచారయ్య పాల్గొన్నారు.

రైతులు అప్రమత్తం

విశాలాంధ్ర-కోడూరు : బంగాళాఖాతంలో ఏర్పడిన మాండోజ్ తూఫాన్‌తో రానున్న రెండు మూడు రోజుల్లో భారీ వర్షాలు పడే అవకాశం ఉందని, వాతావరణ శాఖ హెచ్చరికలతో కోడూరు మండల రైతులు అప్రమత్తంగా ఉండాలని, కోడూరు మండల వ్యవసాయ అధికారులు గురువారం సూచనలు చేసారు. ఈ కార్యక్రమంలో కోడూరు మండల వ్యవసాయ అధికారి భాను ప్రకాష్, అసిస్టెంట్ వ్యవసాయ అధికారి సురేష్ పాల్గోన్నారు.

జగనన్న కాలనీని పరిశీలించిన డ్వామా పీడీ

విశాలాంధ్ర-కూచిపూడి : మొవ్వ మండలంలోని పెదపూడి గ్రామపంచాయతీలో జగనన్న కాలనీలో నిర్మిస్తున్న ఇళ్లను గురువారం హౌసింగ్ ఇంచార్జి పీడిగానున్న జిల్లా డ్వామా పి.డి.సూర్యనారాయణ పరిశీలించారు. తొలుత రూ.40 లక్షలతో నిర్మిస్తున్న సచివాలయ భవనాన్ని రూ. 22 లక్షలతో నిర్మిస్తున్న రైతు భరోసా కేంద్రం నిర్మాణపు పనులను పరిశీలించి సంబంధిత అధికారుల ద్వారా వివరాలు సేకరించారు. అనంతరం పెదపూడి జగనన్న కాలనీలో నివేశన స్థలాలు పంపిణీ చేసిన 234 మంది లబ్ధిదారులకు 50 వివిధ రకాల నిర్మాణపు స్థాయిలో ఉన్నాయని, అదేవిధంగా 8 మంది లబ్ధిదారులు పూర్తి చేసుకున్నారన్న వివరాలను హౌసింగ్ ఏ.ఈ. వి. భాస్కరరావు ఆయనకు వివరించారు. ఆ కాలనీలో పూర్తిస్థాయిలో నిర్మాణమైన కొప్పుల సుభాషిణి ఇంటిని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆమె భర్త కొప్పుల రాజేంద్ర ద్వారా దీనికి సంబంధించిన వివరాలను తెలుసుకొన్నారు. కాగా మిగిలిన లబ్ధిదారులతో సైతం సమావేశాలు ఏర్పాటు చేసి అవగాహన కల్పించి ఇళ్ళు నిర్మించుకోవడానికి చైతన్యపరచాలని ఆదేశాలు జారీ చేశారు. ఈయనతో పాటు సర్పంచ్ భర్త, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు తాతా రాంబాబు, ఎండిఓ .జి. సుధా ప్రవీణ్, ఎంజి ఎన్ఆర్ఈజీఎస్ ఏపీలో కేజ్రీవాల్ కే. లక్ష్మీరెడ్డి, పంచాయతీరాజ్ ఏఈ బి. రామారావు, హౌసింగ్ ఏఈ.వి .భాస్కరరావు, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ వి ఆల్ఫ్రెడ్, హౌసింగ్ వర్క్ ఇన్స్పెక్టర్ రాము, లబ్ధిదారులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణిస్తున్నాయి

విశాలాంధ్ర-పమిడిముక్కల: రాష్ట్రంలో పోలీసుల వైఫల్యం కారణంగా శాంతి భద్రతలు క్షీణిస్తున్నాయని తెలుగు దేశం పార్టీ సీనియర్ నాయకుడు వర్ల రామయ్య అన్నారు. గురువారం కృష్ణాపురం లోఇటీవల ప్రేమోన్మాది చే హత్యకు గురైన పిన్నమనేని తపస్వి అంత్యక్రియలకు పలువురు తెలుగు దేశం పార్టీ నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వర్ల రామయ్య మాట్లాడుతూ ఈ ఉదంతం మొదట్లోనే ఫిర్యాదు చేసినాఅతని పై తగిన చర్యలు తీసుకుని ఉంటే ఈ దారుణం జరిగేది కాదన్నారు. టీడీపీ నాయకురాలు నన్నపనేని రాజకుమారి మాట్లాడుతూ ఈ లాంటి ప్రేమోన్మాదులను వేంటనే ఎన్ కౌంటర్ చేయాలని ప్రభుత్వం పోలీసులు పట్టించుకుని విచారణ పేరుతో జాప్యం చేయకుండా వెంటనే నిందితులను కఠినంగా శిక్షించాలని ప్రస్తుతం యువతులు జాగ్రత్తగా ఉండాలని అన్నారు. గద్దే అనురాధ మాట్లాడుతూ ఈ ప్రభుత్వం పాలనలో మహిళలకు ఏమాత్రం విలువ లేకుండా పోయిందని ప్రతిరోజు ఎక్కడో ఒకచోట ఈ దారుణాలు జరుగుతున్నాయని ఆంధ్రప్రదేశ్‌కు ఉన్న గౌరవం ఈ అరాచకాల వల్ల దిగజారుతోందని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది. పామర్రు నియోజకవర్గ టీడీపీ ఇన్చార్జి బర్లకుమార్ రాజా మాట్లాడుతూ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని, మిత్రులుగాను శత్రువులుగాను పనిచేస్తుందని మనం విచక్షణ కోల్పోయి వాటిని వాడుకోకూడదని ఆయన అన్నారు. తొలుత తపస్వీ మృత దేహానికి నివాళులర్పించి తల్లిదండ్రులని పరామర్శించి ఓదార్చారు. జిల్లా ఐద్వా నాయకులు తపస్వీ కి నివాళులు అర్పించారు.

నేషనల్ రైఫిల్ షూటింగ్ సెలక్షన్ ట్రయల్స్‌కు తన్మ్యా సిరంగి

విశాలాంధ్ర-విజయవాడ స్పోర్ట్స్ : ద నేషనల్ రైఫిల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (రాప్) ఆధ్వర్యంలో త్రివేంద్రంలో జరుగనున్న జాతీయస్థాయి రైఫిల్ షూటింగ్ చాంపియన్‌షిప్‌కు నగరంలోని ద ఇండియన్ అకాడమీ ఆఫ్ షూటింగ్ స్పోర్ట్స్, రైఫిల్ షూటింగ్ అకాడమీకి చెందిన తన్మ్యా సిరంగి అర్హత సాధించింది. 616.3 పాయింట్స్ సాధించి 10 మీటర్ల రైఫిల్ పీప్సైట్ యూత్, జూనియర్, సీనియర్ విభాగాలలో జనవరి 2023 లో జరిగే నేషనల్ రైఫిల్ షూటింగ్ స్క్వాడ్ సెలక్షన్ ట్రయల్‌కు నగరం నుంచి ఎంపికయ్యింది. 14 సంవత్సరాల తన్మ్యా సిరంగి తొలి ప్రయత్నంలోనే 616.3 పాయింట్స్ సాధించటం విశేషం. తన్మ్యా ఎంపికపై రాప్ ప్రెసిడెంట్ సలాలిత్ తొట్టెంపూడి, శెక్రటరీ రాజ్ కుమార్, అకాడమీస్ డైరెక్టర్ నాగిశెట్టి సుబ్రహ్మణ్యేశ్వర రావు పలువురు అభినందనలు తెలిపారు.

నేషనల్ రైఫిల్ షూటింగ్ సెలక్షన్ ట్రయల్స్‌కు అక్షయి

విశాలాంధ్ర-విజయవాడ స్పోర్ట్స్ : ద నేషనల్ రైఫిల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (రాప్) త్రివేంద్రంలో జరుగుతున్న జాతీయస్థాయి రైఫిల్ షూటింగ్ చాంపియన్‌షిప్ పోటీలకు నగరంలోని ద ఇండియన్ అకాడమీ ఆఫ్ షూటింగ్ స్పోర్ట్స్, రైఫిల్ షూటింగ్ అకాడమీకి చెందిన అక్షయి దాయం 616.0 పాయింట్స్ సాధించి, 10 మీటర్ల రైఫిల్ పీప్సైట్ యూత్, జూనియర్ మరియూ సీనియర్ విభాగాలలో జనవరి 2023 లో జరిగే నేషనల్ రైఫిల్ షూటింగ్ స్క్వాడ్ సెలక్షన్ ట్రయల్స్‌కు అర్హత సాధించింది. 9వ తరగతి చదువుతున్న అక్షయి దాయం తొలి ప్రయత్నంలోనే 616.0 పాయింట్స్ సాధించటం విశేషం. అక్షయి దాయం ఎంపికపై రాప్ ప్రెసిడెంట్ సలాలిత్ తొట్టెంపూడి, శెక్రటరీ రాజ్ కుమార్, అకాడమీస్ డైరెక్టర్ నాగిశెట్టి సుబ్రహ్మణ్యేశ్వర రావు, పలువురు అభినందనలు తెలిపారు.

క్రీడల్లోనూ రాణించాలి

విశాలాంధ్ర-మోపిదేవి : విద్యతోపాటు సహపాఠ్యాంశాలైన క్రీడల్లోనూ రాణించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ అన్నారు. గురువారం మండలంలోని కె. కొత్తపాలెం జెడ్పీ పాఠశాలలో ఖేలో ఇండియా అండర్-17 విభాగంలో సబ్ జోన్ బాలికల కబడ్డీ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రమేష్ బాబు మాట్లాడుతూ పురుషులతో సమానంగా బాలికలు అన్ని అంశాల్లో ముందుండాలన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో క్రీడల్లో రాణించిన విద్యార్థులకు విద్య, ఉపాధి అంశాల్లో మంచి అవకాశాలున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా సబ్ జోన్ పరిధిలోని పాఠశాలల నుంచి పోటీల్లో పాల్గొనేందుకు వచ్చిన క్రీడాకారులను వ్యాయామ ఉపాధ్యాయులు ఎమ్మెల్యేకు పరిచయం చేశారు. రెండు రోజులపాటు జరుగనున్న బాలికల కబడ్డీ పోటీలు ప్రారంభ కార్యక్రమంలో ఎంపీపీ రావి దుర్గావాణి, సర్పంచ్ కొక్కిలిగడ్డ మాధవీ, క్రీడాకారులు పాల్గొన్నారు.

చదువుకున్న పాఠశాలను మర్చిపోకూడదు : అజయ్ కలామ్

విశాలాంధ్ర-గన్నవరం : పుట్టిన ఊరును.. చదువుకున్న పాఠశాలను ఎప్పటికీ మర్చిపోకూడదని జీవితంలో ఎంత ఉన్నత స్థాయికి వెళ్లినా చదువుకున్న పాఠశాల అభివృద్ధిలో భాగస్వాములు కావాల్సిన అవసరం ఉందని సీఎం సలహాదారు అజయ్‌కల్లం అన్నారు. గురువారం ఉంగుటూరు జెడ్పీ హైస్కూల్లో నాడు-నేడు నిధులు రూ.2 కోట్లు, పూర్వ విద్యార్థులు, ఎన్నారైలు సంయుక్తంగా రూ.3 కోట్లు సమీకరించి అభివృద్ధి చేసిన పాఠశాలను అజయ్ కల్లం, ఎమ్మెల్యే వంశీ, ఎన్నారై వెంకటాద్రిలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు సభలో ఆయన మాట్లాడుతూ మూడేళ్లుగా వెంకటాద్రి ఎంతో ఓర్పుతో తన సహచరులను కలిసి కోట్లాది రూపాయలు సమీకరించి తాను చదువుకున్న పాఠశాలను అభివృద్ధి చేయడం ఎంతోమందికి ఆదర్శమని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నాడు నేడు పథకం ద్వారా కోట్లాది రూపాయలు ఏం చేసి పాఠశాలల రూపు రేఖలను మారుస్తుందని చెప్పారు. అయితే పూర్వ విద్యార్థులు భాగస్వాములు అయితే పాఠశాల కార్పొరేట్ స్కూళ్లను తలదన్నే స్థాయిలో ప్రభుత్వ స్కూలు అందుబాటులోకి వస్తుందని చెప్పడానికి ఈ ఉంగుటూరు జిల్లా పరిషత్తు స్కూలు ని దర్శనమని చెప్పారు. ఎమ్మెల్యే డాక్టర్ వంశీ మాట్లాడుతూ.పాఠశాలలో మంచి సైన్స్ ల్యాబ్, ఇంగ్లీష్ రీడింగ్ రూమ్, డిజిటల్ ల్యాబ్, డైనింగ్ హాల్ ఏర్పాటుకు ఎన్నారై వెంకటాద్రి సంకల్పించడం అభినందనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉంగుటూరు ఎంపీపీ వి.సరోజిని, సర్పంచ్ ప్రసాద్, ఏపీ ఎన్నార్టీ అధ్యక్షులు మేడపాటి వెంకట్, వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట వెంకయ్య, వైసీపీ ఉంగుటూరు మండల అధ్యక్షులు శంకర్ రెడ్డి, పాఠశాల హెచ్ఎం తదితరులు పాల్గొన్నారు.

18 ఏళ్లు నిండిన వారికి ఓటు హక్కు తప్పనిసరి

విశాలాంధ్ర-పెనమలూరు : 18 యేళ్ళు నిండిన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు గుర్తింపే ప్రధానంగా అధికారులు పనిచేయాలని ఉయ్యూరు రెవిన్యూ డివిజన్ అధికారి ఎన్ విజయ కుమార్ అన్నారు. పెనమలూరు తాహశీల్దార్ కార్యాలయంలో ఎన్నికల అధికారి ఎన్ విజయకుమార్, తాడిగడప మున్సిపాలిటీ కమీషనర్ ప్రకాశరావు ఆధ్వర్యంలో తాడిగడప మున్సిపాలిటీ పరిధిలోని బూత్ లెవల్ అధికారుల అవగాహనా కార్యక్రమంను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ఎన్నికల విభాగమునకు సంబంధించి పరిష్కరించవల్సిన క్లైములు, 18 యేళ్ళు నిండిన వారిని గుర్తించి ఓటు హక్కు కల్పించటానికి తీసుకోవల్సిన చర్యలు, ఓటరు కార్డుకు ఆధార్ అనుసంధానం చేయుట, గుర్తింపు కార్డు జారీ విషయంలో తీసుకోవల్సిన జాగ్రత్తల వివరించారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రూ.10 లక్షలతో సీసీరోడ్ల నిర్మాణం : ధనలక్ష్మి

విశాలాంధ్ర-పమిడిముక్కల: తాడంకి శివారు పండరీపురం లో సిమెంట్ రోడ్డు కి జడ్పీటిసి యోనుగా వెంకటరమణకుమారి సర్పంచ్ ధనలక్ష్మి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జడ్పీటిసి మాట్లాడుతూ రాష్ట్రంలో రహదారులకి ముఖ్యమంత్రి రూ.కోట్లు ఖర్చు చేస్తున్నారని, గడప గడపకి కార్యక్రమంలో ఇచ్చిన హామీలను ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ నెరవేర్చుతున్నారని ఆమె అన్నారు. పస్తుతం పండరీపురం (మర్రివాడ మొండి) రహదారిని రూ.10 లక్షలతో నిర్మిస్తున్నారని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ కె శ్రీలక్ష్మి వైస్ సర్పంచ్ కె మహాలక్ష్మి వైకాపా నాయకులు యేనుగు మస్తానావు తదితరులు పాల్గొన్నారు.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

తాడిగడప బ్రాంచి (11931): తాడిగడప, పెనమలూరు మండలం, కృష్ణాజిల్లా - 521137

స్వాధీనత ప్రకటన (స్థిరాస్తుల కొరకు)

SCHEDULE 6 (RULE 8(1)) of Security Interest (Enforcement) Rules 2002

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ & ఇంటరెస్ట్ (రెండవ) చట్టం, 2002 (2002 యొక్క యాక్ట్ నెం.54) ప్రకారము **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, తాడిగడప బ్రాంచి యొక్క అధీకృత అధికారి అయిన ఈ దిగువ** సంతకందారు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 నందలి సెక్షన్ 13 (12)కు అనుబంధమైన రూల్ 3 ప్రకారము సంక్రమించిన అధికారములతో **ఋణగ్రహీత : మెస్సర్స్ శ్రీ ధరహాస్ బిల్డర్స్ (ప్రొ॥ శ్రీ పునుకొల్లు సూర్యనారాయణరావు)** ఫ్లాట్ నెం. 9, రోడ్ నెం. 1, వెటర్నరీ కాలనీ, విజయవాడ - 520010 & శ్రీ పునుకొల్లు సూర్యనారాయణరావు, తండ్రి : కృష్ణప్రసాద్ (ప్రొ॥ మెస్సర్స్ శ్రీ ధరహాస్ బిల్డర్స్), డోర్ నెం. 1-88-21/1, ఫ్లాట్ నెం. 140/146, సెక్టార్ - 4, యంవిపి కాలనీ, విశాఖపట్నం - 530017 & శ్రీ గొగినేని సుధాకరసాయి బాబు, తండ్రి : రాజగోపాలరావు, **(హామీదార్)**, 54-16-1/26, ఫ్లాట్ నెం. 9, వెటర్నరీ కాలనీ, రోడ్ నెం. 1, రింగ్ రోడ్, విజయవాడ, కృష్ణా - 520008 వారు చెల్లించవలసిన బకాయి మొత్తం రూ. **4,21,16,270.63 పై (అక్షరాలా నాలుగు కోట్ల ఇరవై ఒక్క లక్ష పదహారు వేల రెండు వందల డెబ్బై రూపాయల అరవై మూడు పైసలు మాత్రమే)** + వడ్డీ, ఇతర ఖర్చులు, నోటీసు అందిన తేదీ నుండి 60 రోజులలోగా తిరిగి చెల్లించవలసినదిగా తేది. **03-01-2022న డిమాండ్ నోటీసు** జారీ చేయబడింది.

ఋణగ్రహీత బకాయి సొమ్మును తిరిగి చెల్లించుటలో విఫలమైనందున ఈ దిగువ సంతకందారు సదరు చట్టంలోని సెక్షన్ 13(4)కు అనుబంధమైన సదరు రూల్సు నందలి రూలు 8 ప్రకారము **తేది. 06-12-2022**న దిగువ పేర్కొన్న ఆస్తిని స్వాధీనము చేసుకోవడమైనదని ప్రత్యేకంగా ఋణగ్రహీత మరియు సాధారణ ప్రజానీకమునకు ఇందుమూలముగా తెలియజేయునది.

ఈ ఆస్తి విషయమై ఎవరు ఎటువంటి లావాదేవిలు జరుపరాదని, ఎటువంటి లావాదేవిలైనా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారికి చెల్లించవలసిన బకాయి మొత్తం రూ. **4,21,16,270.63** పై + వడ్డీ మరియు ఇతర ఖర్చులతో ఛార్జికి లోబడి వుండునని ఇందు మూలముగా ప్రత్యేకించి ఋణగ్రహీతలు మరియు సాధారణ ప్రజానీకానికి హెచ్చరించడమైనది. (డిమాండ్ నోటీసు జారీచేసిన తరువాత చెల్లించినవి మినహాయించవలయును).

తనఖా పెట్టిన సదరు ఆస్తుల విమోచనకు ఋణగ్రహీతలు వారికి నిర్దేశించిన కాల వ్యవధి సదరు చట్టములోని సెక్షన్ 13కు అనుబంధమైన సబ్ సెక్షన్ (8) ప్రకారం కలిగియుండురని తెలియజేయడమైనది.

స్థిరాస్తి వివరములు

శ్రీ పునుకొల్లు సూర్యనారాయణరావు, తండ్రి : కృష్ణ ప్రసాద్ గారి పేరిట కృష్ణా జిల్లా, పటమట సబ్ రిజిస్ట్రార్, పెనమలూరు మండలం, తాడిగడప గ్రామం & గ్రామ పంచాయితీ, (ఆర్.ఎస్.నెం. 104/3 వద్ద ఎకరా 0.86 సెంట్లు మరియు ఆర్.ఎస్.నెం. 104/2 వద్ద ఎకరా 0.79 సెంట్లు) మొత్తం ఎకరా 1.65 సెంట్లు లేదా 7986.00 సెంట్ల విస్తీర్ణంలోని స్థలము. **హద్దులు : తూర్పు :** శిరీష్ మరియు ఇతరులకు చెందిన భూమి, **దక్షిణం :** పునుకొల్లు మధురవాణి గారి భూమి, **పడమర :** మేడసాని చంద్రమౌళి గారి భూమి, **ఉత్తరం :** బందరు కాలువ కట్ట

తేది : 06-12-2022 సం/- అధీకృత అధికారి,
స్థలం : విజయవాడ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

యూనియన్ బ్యాంక్ Union Bank of India

చంద్రమౌళినగర్ బ్రాంచి (పూర్వము యస్‌యమ్ఇ బ్రాంచి), డి.నెం.4-18-29, జెయస్ఆర్ హైట్స్, జెయస్ఆర్ రోడ్, డాన్‌బాస్కో స్కూల్ ఎదురు, 5వ & 6వ లైన్ల మధ్య, చంద్రమౌళినగర్, గుంటూరు. ఫోన్ : 0863-2355245

ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టము 54/ 2002 యొక్క సెక్షన్ 13(2) ప్రకారము (SARFAESI ACT) డిమాండ్ నోటీసు

From: చీఫ్‌మేనేజర్ & అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, చంద్రమౌళినగర్ బ్రాంచ్, గుంటూరు వారి నుండి యాక్ట్ 54 ఆఫ్ 2002 క్రింద

ఋణగ్రహీత : శ్రీ ఇమదాబత్తుని కేశవరావు, 1-30-10, 5వ అంతస్థు, మహీంద్రా ఎన్‌క్లేవ్, యఫ్.నెం.1, 4వ లైను, యస్‌వియన్ కాలనీ, గుంటూరు-522006, ఆంధ్రప్రదేశ్, ఇండియా, **సహఅభ్యర్థి : శ్రీమతి ఇమదాబత్తుని వెంకటేశ్వరమ్మ, భర్త : ఇ. కేశవరావు,** 1-30-10, 5వ అంతస్థు, మహీంద్రా ఎన్‌క్లేవ్, యఫ్.నెం.1, 4వ లైను, యస్‌వియన్ కాలనీ, గుంటూరు-522006, ఆంధ్రప్రదేశ్, ఇండియా, **సహహామీదారు : శ్రీ గుంటుపల్లి మురళీమోహన్‌రావు, తండ్రి : పూర్ణచంద్రరావు,** డి.నెం.3-28-48, 6వ లైను, 1వ అంతస్థు, బృందావన్‌గార్డెన్స్, గుంటూరు-522006, ఆంధ్రప్రదేశ్, ఇండియా.

అయ్యా / అమ్మా,

ఈ నోటీసులో ఉదహరించిన వ్యక్తుల హామీతో ఈ క్రింద ఉదహరించిన ఋణసౌకర్యము పూర్వము ఆంధ్రాబ్యాంక్, ప్రస్తుతం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, చంద్రమౌళినగర్ బ్రాంచి నుండి పొందియున్నారు.

వ.నెం.	సౌకర్యము/ ఋణము	పరిమితి	అమలులో ఉందగా	డి.19-11-2022 నాటికి బకాయిసొమ్ము
1	హౌసింగ్ లోన్ - 103630100002272	రూ.12,00,000/-	2020-2021	రూ.7,77,970.41 పై॥

తనఖాపుంచబడిన ఆస్తి యొక్క వివరములు : కృష్ణా జిల్లా, పెనమలూరు మండలం, యనమలకుదురు, యస్.నెం.2/2, డి.నెం.24-5 నందు "శ్రీ దుర్గా ఎన్‌క్లేవ్" రెసిడెన్షియల్ అపార్ట్‌మెంట్ 2వ అంతస్థులో ఆర్‌సిసి ఫ్రేమ్డ్ స్ట్రక్చర్ ఫ్లాట్ నెం.యస్‌యఫ్2కు చెందిన అవిభాజ్యపు భాగమైన 38.00 చ॥గ॥ల విస్తీర్ణముగల స్థలమునకు సంబంధించిన యావదాస్తి. దీనికి హద్దులు : తూర్పు : యామిని చంద్ర యొక్క ఆస్తి యస్‌యఫ్1, **పడమర :** మెట్లు మరియు వరండా, **ఉత్తరం :** శూన్యాకాశము, **దక్షిణం :** శూన్యాకాశము. **మొత్తం 243.66 చ॥గ॥ల విస్తీర్ణములో అవిభాజ్యపు భాగమైన 38.00 చ॥గ॥ల విస్తీర్ణము గల స్థలమునకు హద్దులు : తూర్పు :** మారేడు నాగరాజు యొక్క ఆస్తి, **పడమర : 21 అ॥ల వెడల్పుగల రోడ్డు, ఉత్తరం :** కామినేని వెంకటనారాయణ మరియు ఇతరుల యొక్క ఆస్తి, **దక్షిణం :** కామినేని బాపూజీ యొక్క ఆస్తి.

మీరు ఋణమును/ సౌకర్యమును మరియు/ లేదా వాయిదాలలో/ వడ్డీని/తిరిగిచెల్లించుటలో విఫలమైనందున **డి.19-11-2022**న మీ ఖాతాను ఆర్‌బిఐ మార్గదర్శకాల ప్రకారం యన్‌పిఏగా వర్గీకరించబడినది మరియు మీరందరూ ఉమ్మడిగా మరియు విడివిడిగా **డి.19-11-2022** నాటికి చెల్లించవలసిన బకాయి **రూ.7,77,970.41 పై॥ (అక్షరాల ఏడు లక్షల డెబ్బైఏడు వేల తొమ్మిది వందల డెబ్బై రూపాయలు మరియు నలభైఒక్క పైసలు మాత్రము)** మరియు తదుపరి వడ్డీ చెల్లించవలసియున్నది. పైన ఉదహరించిన చట్టమునందలి సెక్షన్ 13(2) ప్రకారము దిగువ సంతకందారు **డి.21-11-2022**న డిమాండ్ నోటీసు జారీచేసినారు. కానీ అది తిరిగివచ్చినది / ముట్టనందున ఈ పత్రికా ప్రకటన జారీచేయడమైనది. కావున మీ యావన్మందిని ఈ నోటీసు తేదీ నుండి 60 దినముల లోపల పైన సుదహరించిన మొత్తము మరియు వడ్డీ కలిపి చెల్లించవలసినదిగా కోరటమైనది. లేనియెడల బ్యాంకువారు బకాయి రాబట్టుకొను నిమిత్తము కోర్టువారి ప్రమేయములేకుండా, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 54 ఆఫ్ 2002 నందు ఈ క్రింద పేర్కొనబడిన వాటిలో ఒకటిగాని లేదా అంతకుమించిగాని చర్యలను తమ బ్యాంకుకు తనఖాపుంచిన ఆస్తులపై తీసుకొనుట అనివార్యమౌతుంది.(1) ఋణగ్రహీత తనఖాపుంచిన ఆస్తులను లీజుద్వారా గాని అద్దెకుఇచ్చుట ద్వారా గాని విక్రయించుట ద్వారా గాని బకాయి రాబట్టుకొనుటకు హక్కుభుక్తములతో స్వాధీనపరచుకొనుట. (2) ఋణగ్రహీత తనఖాపుంచిన ఆస్తులను లీజుద్వారా గాని అద్దెకుఇచ్చుట ద్వారా గాని విక్రయించుట ద్వారా గాని బకాయి రాబట్టుకొనుటకు మేనేజిమెంట్‌ను స్వాధీనపరచుకొనుట. 3) ఈ ఆస్తుల అధికారమును స్వాధీనపరచుకొన్న పిమ్మట వ్యవహారము చూచుటకు వ్యాపార లావాదేవీలు నడుపుటకు ఎవరినో ఒకరిని నియమించటము 4) అంతేకాకుండా ఈ ఆస్తులపై ఆసక్తిగల వ్యక్తులను, మీకు ఋణపడిఉన్నవారిని లేదా ఋణపడి ఉండబోవు వారిని ఆ మొత్తములను బ్యాంకుకు చెల్లించవలసినదిగా కోరవచ్చును. ఈ నోటీసు దరిమిలా తనఖాపుంచిన పైనుదహరించిన ఆస్తులను బ్యాంకు వారి ముందస్తు లిఖితపూర్వక అనుమతి లేకుండా విక్రయముద్వారా గాని లీజుకిచ్చుట లేదా ఇతరవిధములు గా గాని ఇతరులకు మీరు బదిలీచేయరాదు. ఈ ప్రక్రియలో అన్నివిధములైన ఖర్చులు మరియు అనుకోకుండా సంభవించు ఖర్చులు విక్రయార్జితములో నుండి సర్దుబాటుచేయబడును. ఒకవేళ విక్రయార్జితములు బ్యాంకువారి మొత్తము బకాయికి సరిపోనిచో 2002 సంవత్సరపు SARFAESI చట్టము 54 నందు ఉదహరించబడిన ప్రకారము నిల్వబాకీ వసూలు చేసుకొనుటకు తగిన చట్టబద్ధమైన చర్య తమ అందరిపై ఉమ్మడిగా మరియు విడివిడిగా తీసుకొనబడును. చట్టంలోని సెక్షన్ 13(8) నిబంధనల ప్రకారం తనఖాపుంచబడిన ఆస్తుల యొక్క బహిరంగ వేలము నోటీసు ప్రచురణకు ముందుగా గాని లేదా కొటేషన్లు ఆహ్వానించుటకు ముందుగా గాని లేదా టెండర్లను ప్రజల నుండి లేదా ప్రైవేట్ వ్యక్తుల నుండి ఒప్పందాల మేరకు స్వీకరించుటకు ముందుగా గాని ఆస్తులను బదిలీ చేయుటకు ముందుగా గాని, లీజుకు ముందుగా గాని, కేటాయించుటకు ముందుగా గాని, అమ్మకమునకు ముందుగా గాని బ్యాంకు వారికి మీరు చెల్లించవలసిన బకాయిలు మరియు బ్యాంకు వారిచే చెల్లించబడిన అన్ని కాస్ట్‌లు, ఛార్జీలు మరియు ఇతర ఖర్చులు కలుపుకొని చెల్లించినట్లయితే మీ ఆస్తులను విడిపించుకొను హక్కు కలదు. ఈ నోటీసు బ్యాంకువారికి ప్రస్తుతము అమలు లోనున్న ఇతర చట్టబద్ధమైన హక్కులకు భంగము వాటిల్లకుండా జారీచేయబడినది.

స్థలం : గుంటూరు సం/- చీఫ్ మేనేజర్ & అధీకృత అధికారి
తేది : 08-12-2022 యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (పూర్వము ఆంధ్రాబ్యాంక్), చంద్రమౌళినగర్ బ్రాంచి, గుంటూరు.

విశాలాంధ్ర
ఎన్టీఆర్ జిల్లా

ఎంపీఎఫ్‌సీ గోడౌన్ల

భూ సేకరణ వేగవంతం

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : జిల్లాలో బహుళ ప్రయోజన కేంద్రాల (మల్టీ పర్పస్ ఫెసిలిటీ సెంటర్స్) నిర్మాణ పనులను వేగవంతం చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు తెలిపారు. రాష్ట్ర సచివాయలం నుండి ఎంపీఎఫ్‌సీ గోడౌన్ల భూసేకరణ, నిర్మాణం తదితర అంశాలపై జిల్లాల కలెక్టర్‌లు, జేసీలతో రాష్ట్ర సహకార శాఖ కమిషనర్ బాబు.ఏ గురువారం వీడియోకాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. స్థానిక కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుండి కలెక్టర్ డిల్లీరావు, జేసీ ఎస్.నూపూర్‌అజయ్ వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మల్టీ పర్పస్ ఫెసిలిటీ సెంటర్స్ (ఎంపీఎఫ్‌సీ) గోడౌన్‌లకు సంబంధించి జిల్లాలో మొదటి విడత మంజూరైన 58 గోడౌన్‌ల నిర్మాణ పనులకు సంబంధించి 53 గోడౌన్‌ల పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. ఎప్పటికప్పుడు సోసైటీలకు బిల్లులను పెండింగ్ లేకుండా చెల్లింపులు చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రెండవ విడతలో మంజూరైన 50 ఎంపీఎఫ్‌సీ గోడౌన్ల నిర్మాణాలకు 37 కేంద్రాలకు, మూడవ విడతలో మంజూరైన 21 గోడౌన్‌లకు 19 కేంద్రాలకు ఇప్పటికే భూ సేకరణ పూర్తి చేసినట్లు తెలిపారు. వీడియోకాన్ఫరెన్స్‌లో జిల్లా కో-అపరేటివ్ ఆఫీసర్ సీహెచ్.శైలజ, మార్కెటింగ్ ఏడీ కిషోర్ పాల్గొన్నారు.

ఉచిత టైలరింగ్ శిక్షణా కేంద్రం ప్రారంభం

విశాలాంధ్ర-నందిగామ: పీఎస్పీ బోస్ మెమోరియల్ ట్రస్ట్‌లో ఉచిత టైలరింగ్ శిక్షణ కేంద్రాన్ని నందిగామ మండలం జడ్పీటీసీ నాదెల వెంకటేశ్వరరావు (బాబు), ఎంపీపీ అరిగెల సుందరమ్మ గురువారం మునగచర్లలో ప్రారంభించారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ గాదెల వెంకటేశ్వర రావు (బాబు) మాట్లాడుతూ ట్రస్ట్ ఆధ్వర్యంలో టైలరింగ్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించి గ్రామీణ మహిళలకు ఉచితంగా శిక్షణ ఇవ్వడం సంతోషకరమన్నారు. ఉచిత శిక్షణ ను ప్రతి ఒక్కరూ సద్వినియోగించుకొని వారి కుటుంబాలను ఆర్థిక స్వావలంబన దిశగా వెళ్ళాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జీఎం ప్రసాద్, హెచ్ఆర్ షేక్ సల్మా మరియు మేనేజర్ సుభాని, ట్రస్ట్ స్టాఫ్ తదితరులు పాల్గొన్నారు.

రైతాంగ సమస్యలపై 12న కలెక్టరేట్ ఎదుట ధర్నా

జయప్రదం చేయండి : సీహెచ్.కోటేశ్వరరావు, మల్నీడి యలమందరావు

విశాలాంధ్ర-విజయవాడ(ఇబ్రహీంపట్నం) : ధాన్యం కొనుగోలు, రుణమాఫీ, విద్యుత్ మీటర్ల రద్దు, ఇన్‌పుట్ సబ్సిడీ-బీమా పరిహారం, నీటి ప్రాజెక్టుల నిర్మాణం తదితర ప్రధానమైన రైతాంగ సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ రాష్ట్ర సమితి, రైతు సంఘాలు సంయుక్తంగా ఇచ్చిన పిలుపు మేరకు డిసెంబరు 12వ తేదీన సీపీఐ ఎన్టీఆర్ జిల్లా, రైతు సంఘాల ఆధ్వర్యంలో విజయవాడలోని జిల్లా కలెక్టరేట్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాలో రైతులంతా పాల్గొని జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి సీహెచ్.కోటేశ్వరరావు, ఉమ్మడి కృష్ణా జిల్లా రైతు సంఘం ప్రధాన కార్యదర్శి మల్నీడి యలమందరావు రైతాంగానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఇబ్రహీంపట్నం సీపీఐ కార్యాలయంలో గురువారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న రైతాంగ, గ్రామీణ ప్రజల వ్యతిరేక విధానాలతో వ్యవసాయ రంగం క్లిష్ట పరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతుందని, అప్పుల ఊబిలో కూరుకుపోయి రైతాంగం విలవిల కొట్టుకుంటూ కొంతమంది ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అయినా ప్రభుత్వాలకు ఏమి పట్టకపోగా వ్యవసాయరంగాన్నే కార్పొరేట్‌లకు కట్టబెట్టేందుకు చట్టాలు తేవటం అత్యంత దుర్మార్గమైన విధానాలని విమర్శించారు. డాక్టర్ ఎం.ఎస్.సోమినాథన్ కమీషన్ సిఫార్సుల ప్రకారం మద్దతు ధరల గ్యారెంటీ చట్టాన్ని తక్షణమే తీసుకువచ్చి అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రతిరైతుకు రూ.2లక్షలు వరకు సాగు రుణాలను రద్దు చేయాలని కోరారు. భూముల వద్దే ధాన్యాన్ని కొనుగోలు చేసి వారం రోజుల్లో రైతుల ఖాతాల్లో నగదు జమచేయాలని కోరారు. ప్రకృతి వైపరీత్యాలు, కల్తీ విత్తనాలు, మందుల వల్ల పంట నష్టపోయిన రైతులకు నష్ట పరిహారం ఇవ్వాలని, 50 సంవత్సరాలు పైబడిన రైతులకు నెలకు రూ.10వేలు పెన్షన్ ఇవ్వాలని పేర్కొన్నారు. రైతుల న్యాయమైన 16 డిమాండ్ సాధన కోసం 12వ తేదిన కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాలో రైతులు, సీపీఐ శ్రేణులు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మైలవరం నియోజకవర్గ కార్యదర్శి బుడ్డి రమేష్, ఇబ్రహీంపట్నం మండల కార్యదర్శి కన్నా వెంకటేశ్వరరావు, రైతు నాయకులు జైకర్, పంత్, షేక్.అజీమ్ పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన

విశాలాంధ్ర-జగ్గయ్యపేట: పట్టణంలోని మూడవ వార్డు పుట్ట బజార్‌లో రూ.10 లక్షలతో నిర్మించే రోడ్డు నిర్మాణ పనులకు గురువారం రాష్ట్ర ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ గ్రామాల్లో పట్టణంలో తగిన వసతులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. అభివృద్ధి ప్రజా సంక్షేమమే రెండుకళ్ళుగా మన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పనిచేస్తున్నారని, దానిలో భాగంగా పట్టణంలో రూపురేఖలను మార్చి ప్రజల జీవితాల్లో గుణాత్మక మార్పులను తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ఈ సందర్భంగా మూడో వార్డు నందు పుట్టబజార్ నందు స్థానికులు శిధి లావస్థకు చేరుకున్న రోడ్డు సమస్య గురించి స్థానిక కౌన్సిలర్ కాశీ అనురాధ కిషోర్ కి తెలుపగా వారు ఆ సమస్యను తన దృష్టికి తీసుకురావడంతో స్పందించి నూతన రోడ్డు వేయించారన్నారు. నేడు ఆ పనులకు శంకుస్థాపన చేయడం జరిగిందని తెలిపారు. అదేవిధంగా దాదాపు 30 ఏళ్ల నుంచి రోడ్డు కొంత భాగం ప్రైవేట్ ల్యాండ్‌గా ఉండిపోవడంతో వారితో మాట్లాడి ఆ సమస్యను పరిష్కరిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కెడిసిసి బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు,మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, స్థానిక వార్డు కౌన్సిలర్ అనురాధ కిషోర్,పట్టణ అధ్యక్షులు ఆకుల శ్రీకాంత్ (బాజీ), ఎస్టీ విభాగం అధ్యక్షులు బద్దు నాయక్,కౌన్సిలర్లు తన్నీరు నాగేంద్ర, పూసల పుల్లారావు, స్థానిక నాయకులు పందిటి కోటేశ్వరరావు, షైక్ పెంటు, చిరంజీవి, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

అపరిచిత వ్యక్తులతో బాలికలు జాగ్రత్త : రజిని

విశాలాంధ్ర-జగ్గయ్యపేట రూరల్ : నేటి సమాజంలో పరిచయం లేని వ్యక్తుల పట్ల బాలికలు జాగ్రత్తగా ఉండాలని పసి పిల్లల నుండి పండు ముసలి వరకు మహిళలపై అత్యాచారాలు జరుగుతున్నాయని చిల్లకల్లు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సూపర్‌వైజర్ రజిని అన్నారు. పట్టణంలో గురువారం తొర్రగుంట పాలెం జెడ్పీ పాఠశాలలో ఏర్పాటుచేసిన మహిళల స్నేహపూర్వక సమావేశంలో రజిని మాట్లాడుతూ సమాజంలోని బాలికలు తోటి మగవారి పట్ల అప్రమత్తంగా ఉండాలని వారి నడవడిక ప్రవర్తనను గమనించి తల్లిదండ్రులకు తెలియజేయాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం పసుపులేటి వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయురాలు విజయలక్ష్మి, జీఎంఎస్ కె ఎస్కే పర్వీన్, ఏఎన్ఎం సునీత, అంగన్వాడి కార్యకర్తలు కళావతి, రాణి, శోభ, ఆశావర్కర్లు పాల్గొన్నారు

నగరాభివృద్ధి వైసీపీ ఘనతే : భాగ్యలక్ష్మి

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ : తూర్పు నియోజకవర్గం సర్కిల్-3 పరిధిలోని 18వ డివిజన్ రూ.208.09 లక్షల నగర పాలక సంస్థ సాధారణ నిధులతో రాణీగారితోట సిమెంట్ గౌడన్ పార్క్‌లో అభివృద్ధి పనులకు నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, నగర పాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, తూర్పు నియోజకవర్గం వైసీపీ ఇన్‌ఛార్జ్ దేవినేని అవినాష్ గురువారం శంఖుస్థాపన చేశారు. అనంతరం మేయర్ మాట్లాడుతూ తూర్పు నియోజకవర్గం పరిధిలో ఎన్నడు లేని అభివృద్ధి పనులు నేడు చేపట్టినట్లు తెలిపారు. ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించటంలో నగరపాలకసంస్థ నిధులతో అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశామన్నారు. దేవినేని అవినాష్ మాట్లాడుతూ గత మూడున్నరేళ్లుగా నియోజకవర్గంలో అనేక అభివృద్ధి పనులు వేగంగా జరుగుతూ ప్రజలకు మెరుగైన సౌకర్యలు కల్పిస్తున్నట్లు తెలిపారు. కమిషనర్ మాట్లాడుతూ 18వ డివిజన్‌లో సీసీ రోడ్లు, కమ్యూనిటీహాల్ పెయింటింగ్, ఫ్లోరింగ్, పెండింగ్ పనులు, భూగర్భ డ్రెయినేజి, మంచినీటి సరఫరా పైప్‌లైన్స్, సైడ్ లైటింగ్ పనులు, పచ్చదనం ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం అందించాలనే లక్ష్యంగా పార్క్‌ను అభివృద్ధి చేసి తిరిగి ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు బెల్లం దుర్గ, అవుతు శ్రీశైలజారెడ్డి, స్థానిక కార్పొరేటర్ వెంకట సత్యనారాయణ, 17వ డివిజన్ కార్పొరేటర్ తంగిరాల రామిరెడ్డి, జోనల్ కమిషనర్-3 డాక్టర్ ఏ.రవిచంద్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈజీ ఆఫ్ లివింగ్ ఇండెక్స్-2022 కేంద్ర ప్రభుత్వం గృహకల్ప, పట్టణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో దేశంలోని నగరాల్లో జీవన ప్రమాణాలు, సుస్థిరమైన వసతులు, ఆర్థిక వనరులపై సిటీజన్ పర్సెప్షన్ సర్వేలో ప్రతి ఒక్కరూ పాల్గొని జాతీయ స్థాయిలో నగరాన్ని ప్రథమ స్థానంలో నిలిచేలా సహకరించాలని ఈ సందర్భంగా వారు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా వారు ఈజీ ఆఫ్ లివింగ్ ఇండెక్స్-2022 బ్రోచర్స్ ఆవిష్కరించారు.

వంగవీటి మోహన్ రంగా అందరివాడు

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : గత కొద్ది రోజులు గా ఆంధ్ర తెలంగాణ రాధా రంగా చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు, అధ్యక్షులు కాలేపాలెం బుజ్జిపై వస్తున్న ఆరోపణలు పూర్తిగా అవాస్తవాలే అని కాపు నాయకులు, రాయలసేన మాసపత్రిక సంపదకులు పి.ఈశ్వర్ తెలిపారు. గాంధీనగర్ లోని ఆంధ్ర, తెలంగాణ రాధా రంగా మిత్రమండలి కార్యాలయంలో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రంగా ఆశయసాధనకు కృషి చేస్తున్న వ్యక్తి బుజ్జి అని కొనియాడారు. రంగా ఆశయాలకు అనుగుణంగా ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తున్న బుజ్జికి సహాయ సహకారం అందించాలని సూచించారు.కాపు నాయకుడుగా ముద్ర వేసుకున్న వంగవీటి మోహన్ రంగా అందరివాడన్నారు. ఆంధ్ర తెలంగాణ రాధా రంగా చారిటబుల్ ట్రస్ట్ రాష్ట్ర ఉపాధ్యక్షులు రావి శ్రీనివాసరావు, గుంటూరు జిల్లా ఉపాధ్యక్షులు షేక్ మహమ్మద్ రియాజ్, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు తోట నాగరాజు పాల్గొన్నారు.

జాతీయ పార్టీగా ఆమ్ ఆద్మీ

విశాలాంధ్ర,విజయవాడ (గాంధీనగర్) : ఆమ్ ఆద్మీ పార్టీ పేదవర్గాల పార్టీగా ప్రజలు గుర్తించారని అందుకే ఢిల్లీ కార్పొరేషన్ ఎన్నికల్లో ఘనవిజయం సాధించటంతో పాటు గుజరాత్‌లో మొదటిసారిగా ప్రాతినిధ్యం పొందటం జరిగిందని ఆ పార్టీ రాష్ట్ర నాయకులు పోతిన వెంకట రామారావు తెలిపారు. గురువారం గాంధీనగర్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలో ఆమ్ ఆద్మీ పార్టీ నేషనల్ పార్టీ గా విస్తరిస్తుందన్నారు.అన్ని చోట్లా తాము విలువలతో కూడిన రాజకీయం చసి సామన్యలకు అండగా ఉండే విధంగా బేసిక్ పద్ధతులు పాటిస్తున్నాము అన్నారు. ఏపీలో కూడా మా పార్టీ విస్తరిస్తుందన్నారు. మా ధ్యేయం అప్పులు లేని రాష్ట్రంగా తీర్చి దిద్దటమే అని అన్నారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సీబీఎస్ఈ సౌత్‌జోన్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో ఆంబిటస్ సత్తా

విశాలాంధ్ర-విజయవాడ స్పోర్ట్స్ : ఈ నెల 4 నుంచి 7 వరకు ఓయాసిస్ స్కూల్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన సౌత్‌జోన్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో గుణదలలోని ఆంబిటస్ వరల్డ్ స్కూల్ విద్యార్థులు పతకాలు సాధించినట్లు హెచ్ఎం సుధాపిశ్రీదేవి తెలిపారు. అండర్-17 విభాగంలో 75 కేజీల విభాగంలో జశ్విత రోస్ తంటేపూడి రజత పతకం, 44-48 కేజీల విభాగంలో ఆళ్ళ సాయిలిపిక కాంస్య పతకం సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థినిలను కోచ్ బి.రాజారమేష్‌ను, పాఠశాల వ్యాయామ విద్యావిభాగాధిపతి జి.విజయ్‌కుమార్‌ను పాఠశాల కరస్పాండెంట్ డైరెక్టర్ వంశీకృష్ణా దొప్పలపూడి, డైరక్టర్ ఈడ్పుగంటి మానసలు అభినంధించారు.

జాతీయస్థాయి పోటీలకు జూనియర్ సాఫ్ట్ టెన్నిస్ జట్ల పయనం

విశాలాంధ్ర-విజయవాడ స్పోర్ట్స్ : ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని లక్నోలో ఈ నెల 9 నుండి 13వ తేదీ వరకు జరుగనున్న 17వ జాతీయస్థాయి జూనియర్ సాఫ్ట్ టెన్నిస్ ఛాంపియన్ షిప్ కు ఆంధ్రప్రదేశ్ జూనియర్ బాల బాలికల జట్లు పయనమయ్యాయని ఏపీ సాఫ్ట్ టెన్నిస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి దారం నవీన్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు వల్లే శ్రీనుబాబు, కోశాధికారి అబ్దుల్ కరీమ్, ఎన్టీఆర్ జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ చీఫ్ కోచ్ అజీజ్ జట్ల సభ్యులకు క్రీడా దుస్తులను అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. రాష్ట్ర జట్లకు ఎంపికైన సభ్యుల వివరాలు ఇలా ఉన్నాయి. బాలుర విభాగంలో ఎస్.ఆరోన్ రోనల్ డిన్ హెూ, ఆర్.కరణ్ కుమార్ రావాల్, వై.భాను ప్రకాష్ (అనంతపురం), పి.జీవన్ గౌతమ్, జి.బాల మనోజ్ కుమార్ (గుంటూరు), ఎమ్.సుధానవ్ రవి నందన్ (నెల్లూరు), ఎమ్.రేవంత్ (కృష్ణా), నూరుల్ హుదా (కడప), బాలికల విభాగంలో పి.యుతిక, ఎమ్.భావన, పి.లావణ్య, జి.శ్వేతా, వై.వి.అక్షయ (కృష్ణా), ఎమ్.లిల్లి గ్రేస్ (గుంటూరు), ఎమ్.మోక్ష (కడప)లు ఎంపికయ్యారు.

మోటార్ సైకిళ్ల దొంగల అరెస్టు

విశాలాంధ్ర-గంపలగూడెం : గంపలగూడెం మండలంలో గత కొద్ది రోజులుగా వరుస దొంగతనాలు జరుగుతున్న నేపథ్యంలో తిరువూరు సిఐ ఆర్ భీమరాజు, గంపలగూడెం పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ వి సతీష్ తమకు రాబడిన రహస్య సమాచారం మేరకు గురువారం తెల్లవారుజామున మూడు గంటల సమయంలో గంపలగూడెం మండలంలోని పెనుగోలను శివారులోని మిట్టగుట్ట వద్ద బైకు దొంగలను(షేక్ నాగుల్ మీరా 25 సం సన్నాఫ్ గాలి సాహెబ్, షేక్ బాజీ 25 సం సన్నాఫ్ అల్లి సాహెబ్) అరెస్టు చేసి విచారించగా సుమారు రెండు లక్షల డెబ్బై వేల రూపాయల విలువచేసే 8 బైకులు ఒక మేకను దొంగిలించినట్లు బైకు దొంగలు తెలిపినట్లు, వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వి సతీష్ తెలిపారు. ఈ కేసులో అత్యంత ప్రతిభ కనబరిచిన గంపల గూడెం పోలీస్ స్టేషన్ కు చెందిన ఏఎస్ఐ జి వెంకటేశ్వర్లు, కానిస్టేబుల్లు సిహెచ్ గోపి, ఎస్.కె ఖాసీం బాబు, ఎస్ శివకృష్ణ లకు ప్రోత్సాహ రివార్డులు ఇచ్చినట్లు ఎస్సై సతీష్ తెలిపారు.

ప్రసూన రామన్‌కు 'జ్యోతిష్య సౌగంధిని'

విశాలాంధ్ర-విజయవాడ కల్చరల్ : సాహితీ, సాంస్కృతిక, సామాజిక, సాంఘిక సేవాతత్పరురాలు, జ్యోతిష్య విదుషీమణి, వాస్తు సిద్ధాంతి ప్రసూన రామన్ కు జ్యోతిష్య సౌగంధిని బిరుదు ప్రదానం జరిగింది. రాగలహరి సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం కౌతా పూర్ణానందం సత్రం హాలులో ఆమె పుట్టినరోజు సందర్భంగా జరిగిన సినీ సంగీత విభావరి కార్యక్రమంలో పలు కళాసంస్థల ప్రతినిధుల, కళాభిమానుల, కళాకారుల, పలు రంగాల ప్రముఖుల హర్షధ్వానాల మధ్య ఆమె బిరుదునందుకున్నారు. జ్యోతిష్య విజ్ఞానరత్న పివి రామన్ ధర్మపత్నిగా జ్యోతిష్య శాస్త్రంలో,సేవా రంగంలో ఆయన మార్గాన్ని సుసంపన్నం చేస్తూ అందరి అభిమానాన్ని పొందుతున్న ఆమెకు బిరుదు ప్రదానం చేయడం ఎంతో సముచితమని సభకు విచ్చేసిన అతిథులు పేర్కొన్నారు. అతిథులుగా కొప్పరపు వెంకట బలరామకృష్ణమూర్తి దంపతులు, నిడుమోలు రమా సత్యనారాయణ,డాక్టర్ పరుచూరి విజయలక్ష్మి, డాక్టర్ భాగ్యశ్రీ,మారేపల్లి జోషి, బి.వి వీరభద్రరావు, సంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు మల్లాది స్వాతి తదితరులు విచ్చేసి జ్యోతిష్య, వాస్తు రంగాలలో ఆమె అఖండ కీర్తి శిఖరాలనధిరోహించాలని కోరుతూ జన్మదిన శుభాకాంక్షలు అందించారు. పర్యవేక్షణ సంస్థ కార్యదర్శి అయ్యప్పన్ చేయగా వ్యాఖ్యాతగా కొప్పుల అశోక్ ఆనంద్ వ్యవహరించారు. నిర్వహణ కారుమంచి రాజు,జిలాని ఖాన్ లు చేశారు. వేదికపై జరిగిన సినీ సంగీత విభావరి సంగీత శ్రోతలను సమ్మోహనపరుస్తూ సాగింది. మల్లాది స్వాతి, మల్లీశ్వరి, ఆదిరాల జయప్రభ, డేవిడ్ రాజు, అయ్యప్పన్, శ్రీనివాసరావు, గిరివరప్రసాద్ తదితరులు పలు చిత్రాలలోని పాటలను రస రమ్యంగా పాడి ఆహూతుల హర్షధ్వానాలందుకున్నారు. వీరికి కీ బోర్డుతో రవిబాబు, తబలతో వెంకట్, ప్యాడ్స్ తో ప్రవీణ్, జాజ్ తో కొండయ్య రక్తిగా సహకరించారు.

మత్తు లేని సమాజానికి కృషి చేయాలి

విశాలాంధ్ర-విజయవాడ : మత్తులేని సమాజానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పటమట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ డి.కాశీవిశ్వనాథ్ పిలుపునిచ్చారు. నవజీవన్ బాల భవన్ ఆధ్వర్యంలో ఆటోనగర్ లోని ఆటో మొబైల్ టెక్నిషియస్ అసోయేషన్ హాల్‌లో పడమట పోలీస్ స్టేషన్ పరిధిలోని మహిళా సంరక్షణ కార్యకర్తలకు మాదక ద్రవ్యాలు, సోషల్ మీడియా దుర్వినియోగంపై వర్క్‌షాప్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతథిగా పాల్గొన్న కాశీవిశ్వనాథ్ మాట్లాడుతూ మత్తు పదార్థాల వలన విద్యార్థుల జీవితాన్ని నిలువెల్లా నాశనం చేస్తోందన్నారు. సరదాగా అలవాటు చేసుకొని చివరకు మత్తు పదార్థాలు లేకుండా ఉండలేని పరిస్థితికి వస్తున్నారని తెలిపారు. అనంతరం నవజీవన్ బాల భవన్ ప్రోగ్రాం మేనేజర్ గోళ్ళమూడి శేఖర్ బాబు మాట్లాడుతూ మత్తు పధార్థాల మహమ్మారి నుండి సులభంగా బయట పడచ్చన్నారు. మత్తు పదార్థాల వ్యసనం నుండి బయటపడటానికి అవకాశం ఉందన్నారు.

బందరురోడ్డు, విజయవాడ.

KVB Karur Vysya Bank

బంగారు నగల వేలం ప్రకటన

ఈ దిగువ తెలిపిన నగలను బ్యాంకు వారు బహిరంగ వేలం ద్వారా వేలం వేయ నిర్ణయించినారు కావున తెలియజేయడమైనది.

వేలం జరుగు స్థలము : ది కరూర్ వైశ్యా బ్యాంక్ లిమిటెడ్, బందరురోడ్డు బ్రాంచి, డోర్ నెం : 38-8-46, ఎం.జి.రోడ్డు, లబ్బీపేట, కృష్ణాజిల్లా, విజయవాడ-520010. ఫోన్స్ : 0866-2485702, 2487349

నగల తనిఖీ, సమయం : 23/12/2022 మ॥3-00 గం.ల నుండి మ॥ 3-30 గం.ల వరకు

వేలం జరుగు తేదీ, సమయం : 23/12/2022 మ॥ 3-45 గం.లకు.

వ. సం.	ఋణగ్రహీత పేరు & చిరునామా	ఖాతా నెం.	మొ॥ బరువు	నికర బరువు
1)	సీసాల దుర్గా ప్రసాద్, 4-2/4-42ఎ, ఈద్గామహల్ వీధి, విద్యానగర్, విజయవాడ, ఆంధ్రప్రదేశ్- 520001.	1441802000009526	119.8	113.6
2)	గోపాలదాసు రమణయ్య 41-1/14 638ఎ, తారకరామ నగర్, కృష్ణలంక, రాణీగారితోట, విజయవాడ, ఆంధ్రప్రదేశ్- 520013.	1441802000009639	19.47	19.47
3)	రాయపూడి రాజేశ్వరి 32-11/4-7/2, గుమ్మడివారి వీధి, ఆర్‌సిఎం చర్చి రోడ్డు, మొగల్రాజపురం, విజయవాడ, ఆంధ్రప్రదేశ్- 520010.	1441802000009645	14.42	14.42

ముఖ్య నియమ నిబంధనలు :

1) పైన తెలిపిన ఋణ గ్రహీతలకు గతంలో జారీచేసిన నోటీసులకు (అవి ఏ కారణము చేతనైనను తిరిగి వచ్చిననూ) దీనినే ఆఖరి నోటీసుగా భావించ వలసినది.
2) ఒక వేళ ఋణగ్రహీత మరణించినచో వారి వారసులకు కూడా ఈ ప్రకటన ద్వారా తెలియజేయడమైనది.
3) ధరావత్తును బ్యాంక్ వారిచే వేలం తేదీ మ॥ 3-30 గం.ల వరకు మాత్రమే స్వీకరించబడును.
4) విజయవంతమైన పాటదారుడు వేలం తేదీ మ॥ 4-00 గం.ల లోగా ధరావత్తు మినహా మిగిలిన పాట మొత్తమును చెల్లించి నగలను స్వంత బాధ్యత వహించి పొందవలెను.
5) నగల నాణ్యతను పాటకు ముందుగానే పాటదారుడు సరి చూసుకోవలెను. అందుకు బ్యాంక్ బాధ్యత వహించజాలదు.
6) ఏ విధమైన ముందస్తు ప్రకటన లేకుండానే వేలంను పాక్షికముగా గానీ పూర్తిగా గాని రద్దు చేయు అధికారము బ్యాంక్‌కు కలదు.
7) పాటదారుడు సరైన ఫోటో మరియు చిరునామా ఋజువులను ప్రాథమికముగా దాఖలు చేయుట తప్పనిసరి.
8) ఇతర పూర్తి నియమ నిబంధనల కొరకు పైన ఉదహరించిన బ్రాంచి నందు సంప్రదించగలరు.
9) అమ్మకపు పన్నును కొనుగోలుదారుడే భరించవలసి ఉంటుంది.

విజయవాడ
08-12-2022

ఇట్లు
ది కరూర్ వైశ్యాబ్యాంక్ లిమిటెడ్., బ్రాంచి మేనేజర్

రైల్వే-తపాలాతో పార్శిల్ వస్తువులు ఇంటికే..

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : రైల్వే-తపాలా సేవలు రెండింటినీ ఏకీకృతం చేయడం వలన ప్రజలు తమ తమ గమ్యస్థానాలకు రవాణా చేయాలనుకుంటున్న పార్శిల్ వస్తువులను ఇంటి వద్దనుండే నిర్వహిం చుకునే విదంగా సేవలు పొందవచ్చు అని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ పేర్కొన్నారు. దక్షిణ మధ్య రైల్వే -భారతీయ తపాలా శాఖ సంయుక్తంగా పార్సెల్ వినియోగదారులతో గురువారం సికింద్రాబాద్ డివిజనల్ హెడ్‌క్వార్టర్స్ సంచాలన్ భవన్‌లో పార్శిల్ సరకు రవాణా వినియోగదారులతో పాటుగా రైల్వే & తపాలా శాఖ అధికారులతో కలసి సెమినార్ నిర్వహించారు. ఈ సమావేశంలో ఎస్సీ రైల్వేలో ఉన్న 6 డివిజన్‌ల నుండి వినియోగదారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ ఈ సమావేశం యొక్క ప్రధాన లక్ష్యం. ఈ రెండు సంస్థలు తమ ప్రాబల్యాన్ని/పరిధిని ఉపయోగించుకోవడం ద్వారా వినియోగదారులకు ఇబ్బందులు లేకుండా అన్ని ప్రాంతాలకు సకాలంలో పార్సెల్ సేవలను అందించడమే ఈ నూతన విధానం యొక్క లక్ష్యం అన్నారు. భారతీయ రైల్వేలు దాదాపు 7,000 స్టేషన్ల విస్తారమైన నెట్‌వర్క్‌ను కలిగి ఉందని అలాగే తపాలాశాఖ దాదాపు 1.5 లక్షల పోస్టాఫీసులతో దేశంలోని అన్ని ప్రాంతాలకు పార్సిళ్లను చేర్చేందుకు ఈ రెండు శాఖలు సంయుక్తంగా సేవలను అందించ డంలో ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని పేర్కొన్నారు. తపాలా శాఖ ఎక్స్‌ప్రెస్ రైలు సర్వీసుల లగేజీ గదులలో అందుబాటులో ఉన్న పార్శిల్ స్థలాన్ని సమర్థవంతంగా వినియోగించుకొని పార్శిల్ వినియోగదారులకు పార్సెల్ బుకింగ్ మరియు డెలివరీ సేవలలో ఎలాంటి అవాంతరాలు లేకుండ ఆది నుండి చివరకు సేవలను సమర్థవంతంగా వినియోగించుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశానికి తెలంగాణ రీజియన్ చీఫ్ పోస్ట్ మాస్టర్ జనరల్ కె. ప్రకాష్ అధ్యక్షత వహించారు. ఎస్సీ రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ కమర్షియల్ మేనేజర్ జి. జాన్ ప్రసాద్,చీఫ్ కమర్షియల్ మేనేజర్, సికింద్రాబాద్ డివిజన్ డి ఆర్ ఎం అభయ్ కుమార్ గుప్తా,హైదరాబాద్ డివిజన్ డిఆర్ఎం శరత్ చంద్రయాన్,చీఫ్ కమర్షియల్ మేనేజర్(ఫ్రైట్ సర్వీసెస్)డాక్టర్ బి.ఎస్. క్రిస్టోఫర్ పాల్గొన్నారు.

బాధ్యతారాహిత్యంపై ఎంపీపీ ఆందోళన

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: ప్రజాప్రతినిధులు బాధ్యతా రాహిత్యంగా వ్యవహరించిన విషయమై విస్సన్నపేట ఎంపీపీ పిల్లి మెర్సీ వనజాక్షి ఆందోళన వ్యక్తం చేశారు. పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక రూపకల్పన విషయమై విస్సన్నపేట మండల పరిషత్తు కార్యాలయంలో గురువారం జరిగిన అవగాహనా సదస్సుకు ఆమె ముఖ్యఅతిధిగా హాజరయ్యారు. ఈ సదస్సుకు సచివాలయ సిబ్బంది హాజరైనా, ప్రజాప్రతినిధులు గైర్హాజరయ్యారు. ఈ సమావేశానికి మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు హాజరు కావలసి ఉండగా, అంతంతమాత్రంగా కూడా వీరి హాజరు లేకపోవటంతో అసహనం వ్యక్తం చేశారు. మండలంలో 12మంది సర్పంచులు, 18మంది ఎంపీటీసీ సభ్యులకు కేవలం ఇద్దరు సర్పంచులు మాత్రమే హాజరైనా, ఒకరు సదస్సు ఆరంభంలోనే వెళ్లిపోయారు. ఒక ఎంపీటీసీ సభ్యురాలు తొలుత హాజరైనా, చివరివరకు ఉండలేదు. అభివృద్ధి ప్రణాళిక లేకుండా వీరు గ్రామాల్లో ఎలా అభివృద్ధి చేస్తారంటూ ఎంపీపీ వనజాక్షి ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశానికి హాజరైన సచివాలయ సిబ్బందికి విస్సన్నపేట పంచాయతీ కార్యనిర్వహణాధికారి బీఎస్ఎస్.శ్రీనివాస్, రీసోర్సుపర్సన్లు మురళి, రామారావు, రాజు తదితరులు అవగాహన కల్పించారు. సమావేశానికి ఈవోఆర్డీ ఝాన్సీలక్ష్మి, అధ్యక్షత వహించారు.